# హా శ్య నా టి క

## మ ర ణాం త క ము

ర చ యి త

డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.

ప్రకాశకులు

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

**HASYA NATIKA**

(A Telugu Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**


ప్రథమ ముద్రణ : 1977 (2000 ప్రతులు )

పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084. Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం .:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట
హైదరాబాద్ -500090. Cell -9391028231 .

వెల : రూ.60/-.



సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# హా శ్య నా టి క

## మరణాంతకం

**భూమికలు**

1 జానిక మ్మ

2. సరళ - ఆమె కూతురు

3. రంగనాథం - అల్లుడు (సరళ భర్త)

4. డాక్టర్ కుమారస్వామి - రంగనాథం బాల్యమిత్రుడు

( సరళ-తలగడ దిండు మీద లేసుతో కుడుతూంటుంది

వీథిలోంచి జానికమ్మ ప్రవేశం).

జానికమ్మ: ఏమిటే సరళా, ఏం చేస్తున్నావు?

సరళ : ఏం లేదమ్మా లేసుతో అల్లుతున్నాను.

జా: ఏమి టల్లేది. పువ్వులా, ఆకులా?

స : అక్షరాలు

(జానికమ్మవచ్చి సులోచనాలు సవరించుకుంటూ చూచి)

జా : ఓహో, 'రంగనాథం', మీ ఆయన పేరన్నమాట అల్లేది. ఏం. మురు పే! సరయినవాడైతే ఇంకా ఎంత మురిసి పోయేదానివో?

స : ఇప్పుడేమి లోటొచ్చిందనే అట్లాంటావు అమ్మా !

జా : నీకే తెలుస్తుందిలే, ఎందుకా తొందర.

స: ఇప్పుడు మునిగిందేమిటి?

జా ; నే నో విషయం చెబుతాను, నువ్వు నమ్ముతావా?

స : ఎందుకు నమ్మనే అమ్మా? ఏమిటో చెప్పు.

జా: మీ ఆయన ఈ ఊళ్ళోనే ఉన్నాట్ట. ఎప్పుడొచ్చాడో తెలియదుగాని, నిన్న పొద్దునే చూచినవాళ్లు నాతో చెప్పారు.

స : ఎవరు చెప్పారే!... నిజమేనా!

జా: ఎవరా ! తులశమ్మగారు.

స : తులశమ్మగారా! ఆవిడ ఆయన ఎల్లా కనిపించారు? ఎక్కడ చూచింది? ఎవర్ని చూచి ఎవరనుకుందో చత్వారం మనిషి?

జా : నువ్వు చెప్పినా నమ్మవని నాకు తెలుసు. చిన్నప్పటినుంచి ఇంతే. వట్టి వెర్రి బాగులదానివి!

స : పోనీ, ఎక్కడ చూచిందో చెప్పకూడదూ?

జా : ఎక్కడోనా, డాక్టరు కుమారస్వామిగారి ఇంట్లో, నిన్న ఉదయం సరిగ్గా పన్నెండు గంటల...

స : 35 నిమిషాల 38.5 సెకండ్లకు ఆవిడ అక్కడికెందు కెళ్లవల్సి వచ్చింది?

జా : ఇది మరీబాగుందే, డాక్టరు గారింట్లో సత్యనారాయణ వ్రతమట. వాళ్ళింట్లో వంటకు సాయం పిల్చారు.

స : అట్లాగా! సరిగ్గా ఆయన్నే చూచిందంటావా ?

జా : అనుమానమేమిటే, ఎక్కడున్నా కాలూ నోరు ఆగని మనిషేగా మీ ఆయన! ఏమయినా సరైన మనిషా ఏమిటి? ఎక్కడ పడితే అక్కడ నలుగుర్ని చుట్టవేసుకొని వేళాకోళం, వెక్కిరింతలు,ఒక టేమిటి...

స : అయితే ఇక్కడి కెందుకు రాలేదు చెప్మా!!

జ: అమ్మయ్య! ఇప్పటికైనా ఆ ప్రశ్న వేసుకున్నందుకు సంతోషం. పోనీ రాత్రి అన్నం తిన్నతర్వాతైనా ఇక్కడికి రాకూడదా?

స : వాళ్ళిద్దరూ మంచి స్నేహితులమ్మా. ఒకవేళ డాక్టరుగారు బలవంత పెట్టారేమో? ఏమో, ఏదైనా అర్జంటు పనుంటే అల్లాగే వెళ్ళి పోయారేమో?

జా: ఇక్కడకు రమ్మని వ్రాశానుగదా! నావంట్లో బాగుంటం లేదనిగదా నిన్ను ఇక్కడకు టెలిగ్రామ్ మీద పిలిపించింది. అత్తగార్ని ఆ మాత్రం చూచన్నా పోవద్దూ... జబ్బుగా వుందని వ్రాసినప్పుడు?

స: అమ్మా! నువ్వు, అమాటంటుంటే నాకు భయమేస్తుందే! నీకు నిజంగానే జబ్బు లేదని తెల్సుకొని కోపంవచ్చి రాలేదేమోనే! ఆయన కబద్ధాలంటే పరమ అసహ్యం. ఎందుకు అబద్ధాల టెలిగ్రాం ఇచ్చి రప్పించావే ?

జా: ఏణ్ణార్ధం అయింది నువ్వు కాపురానికెళ్ళి. ఒక్కసారన్నా పంపించారా కాల్చుకు తిన్నారు, ప్రాణం మీదకొచ్చిందని టెలిగ్రామిస్తే ఇంక తప్పనిసరని పంపారు.

స : న న్నక్క డేమీ కాల్చుకు తినలేదు, ఏమాట కామాటే చెప్పుకోవాలి. మా అత్తగారున్నారే, సత్యకాలం మనిషి. ఉత్తమా యిల్లాలు.

జా : అదుగో ఆ మాటనకు, తల్లితోడుతో చెప్పుకుందుక్కూ స్వతంత్రంలేకుండా చేశారే అమ్మా. ఎన్ని సార్లు పంపమని మీ మామగారికి వ్రాయించాను? మీ ఆయనకు తీసుకు రమ్మని కబురు పెట్టాను ?

స : మామగారు తీసుకొనివెళ్లమనే ఎన్నోసార్లన్నారు. ఒక్కగాని ఒక్కపిల్ల. తండ్రికూడా లేడు. పాపం తల్లికి చూపించిరారా ! అని నీ ఉత్త రం వచ్చి నప్పుడల్లా మామగారు అన్నారే.

జా : నాకేం వ్రాశారో ఎరుగుదువా, నన్నే అక్కడకు రమ్మన్నారు,

స : పోనీ రాకపోయావా ? తప్పేముంది. ఎవరొచ్చినా మా అత్తవారింట్లో ఎంతో ఆప్యాయంగా చూస్తారు.

జా : చూడకే... పిల్లతో పాటు ఈ ఉన్న ఆస్తినికూడా అప్పచెప్పి, వాళ్లింట్లో వంటలక్క కొఱత లేకుండా నేను కూడా- వచ్చేపోయే వాళ్ళందరికీ, ఎత్తే గిన్నె దింపేగిన్నె, అందుకోసమేగా నన్ను రమ్మన్నది మీ నాన్న అంతేలే. అడ్డమయిన వాళ్ళని నలుగుర్ని తోడెట్టు కొచ్చేవారు. దింపిన నడుము ఎత్త నిచ్చేవారా. నాలుగేళ్ళ నుండేగా కాస్త ఊపిరాడుతోంది. చేతనయితే మీ ఆయన్ని ఇక్క డకు తీసుకొచ్చి కాపరం పెట్టించు. నాకుమాత్రం ఎవరున్నారు? ఇదంతా మీదేకదా! మీ సుఖం కోసమేగా నేను ప్రాకులాడేది!

స : అదేఁవిటే అమ్మా, తల్లిదండ్రుల్ని, నలుగు రన్నదమ్ముల్ని వదిలి పెట్టి ఇక్కడికి ఇల్లరికానికి రమ్మంటావా? అక్కడ పదిమంది గల సంసారం- పూటకు ఇరవై విసళ్ళు లేచే ఇల్లు.

జా : లేకపోతే, ఈ ఇరవైమందికి వంట చెయ్యటానికి నేనూ, విస్తళ్ళు ఎత్తటానికి నువ్వు. ఇందుకేగా నేను మాత్రం అక్కడకురాను, ఆస్తి ఎదురిచ్చి నే నా చాకిరి చేయలేనమ్మా.

స: నీ ఆస్తిమీద మా ఆయనకేమీ ఆశలేదు. ఇక్కడ ఏడాది గ్రాసం అక్కడ వాళ్ళింట్లో నెలకు సరిపోదు. అదీకాక ...

జా : ఆశ ఎందు కుంటుంది. నాతోటేమన్నా కట్టుకుపోతానా? ఎల్లాగా మీకే వచ్చేదేగా, నువ్వు చిన్నపిల్లవి. నీకేమీ తెలియదు. నువు చెపుతావా? మీ ఆయనతోటి నన్ను చెప్పమంటావా?

స: ఏమని?

జా: ఏమనేంటి. వేరింటి కాపురం పెట్టుకొమ్మని.

స : ఊళ్ళో ఉద్యోగం. తల్లిదండ్రిని వదలి వేరేకాపురం పెట్టమని ఎట్లా చెప్పమంటావే?

జా : ఆ మేష్టరుద్యోగం దొరుకదంటావా? మన ఊళ్ళో

స: వేరే కాపురం పెడితే జీతంకూడా సరిపోదేమోనే అమ్మా!

జా: అయితే ఆస్తి వదలి చేతులు కడుక్కుని రమ్మంటున్నానా యేమిటి? మీ వాటా మీరు తెచ్చుకోవటమే.

స : మామగారు బ్రతికుండగా నేనా!

జా: చచ్చేటప్పటికి, ఉన్నపిల్లలకి చదువులకి, పెళ్ళిళ్ళకు ఆస్తి హారతి కర్పూరంలా హరించిపోతే, ఇక పంచుకుందు కేముంటుందే అమ్మాయి. ఈ విషయం మీ ఆయనకు నచ్చచెప్పలేవా?

స: ఆస్తి అంతా మామగారి స్వార్జితం. నా కా ధైర్యంలేదు సుమా!

జా: అల్లా రా దారికి. అడుగులకు మడుగులొత్తుతూ, తలగడాలమీద నామజపం చేస్తూ నువ్వుంటున్నావుగాని అతగాడికి నీ మీద ఈషణ్మా త్రం ప్రేమ ఉన్నట్టు నాకేమీ కన్పించటం లేదు. మొగుడంటే అల్లాగేనా ఉండేది.

మీనాన్న నామాట విని మొదటే పంచు కున్నాడు. కనుకే, ఈ మాత్రమైనా మిగిలింది. ఉమ్మడాస్తి ఊరు పాలన్నారు. అమ్మాయి, ఒక మాట చెపుతాను విను. ఈ రోజుల్లో తండ్రేమిటీ? ఎవడి బాగు వాడు చూసుకోవాల్సిందే. ఇదిగో. నీకు చెప్పటానికి చేతకాకపోతే నేను చెపుతాను.

స: అమ్మా, నీకు చాలసార్లు చెప్పాను. ఎంతచెప్పినా నీ ధోరణి మార టం లేదు. నా కాపరం నిలబడాలంటే నువ్వాయనతో ఈ మాట లేమీ ఎత్తవద్దు. వింటున్నావా!

జా : అంత దగ్గితే ఊడే ముక్కు తుమ్మితే నిలబడుతుందటే? అమ్మో తుమ్మో తేల్చుకోవాలి. ఇంతకీ చెప్పు, మీ ఆయన నీ మాట ఏమీ వినడన్న మాటేగా.

స: అమ్మా, నిజం చెపుతున్నాను. ఆయన మంచంమీద మొగుడుమంచం దిగితే యముడు. నాకు అబద్దం టెలిగ్రాము తల్చుకుంటే ఒళ్ళు జలదరిస్తోంది. ఏం మునుగుతుందోను అని! ఊళ్ళోకొచ్చి, ఇక్కడకు రాలేదంటేనే భయం వేస్తూంది. వెళ్ళిపోయారంటావా!

జా: ఏం బెంగెట్టుకున్నావా, వారంరోజుల్లోనే?

స : వెళ్ళిపోతేనే నయం. అక్కడికి పోయి కాళ్ళమీద పడవచ్చు. ఇది అబద్ధాల టెలిగ్రామనీ - నీ ఒంట్లో ఏం జబ్బు లేదని తెలిస్తే - ఏం గొడవై పోతుందో?

జా: ఏమవుతుంది? రానీ చెపుతాను, నా మాట నువ్వు వినాలి కాని మూడు నిముషాలలో కోరలు తీసిన పాములా ఆడించెయ్యనూ?

స : నాకు నమ్మకం లేదే ఆయన లొంగుతారని.

జా: కాదే. ఆ మందులో ఆ ప్రభావం ఉందే. మొట్టమొదట మగవాళ్ళు అందరూ పోట్లగొడ్డులాగే ఉంటారు. కానీ, మీ ఆయనది మరీ దురుసే!

స : దురుసే కాని మొత్తంమీద మంచివారేనే.

జా : ఇదిగో, నా మాట విని రాగానే కాఫీలో కలిపి ఇచ్చేసెయ్యి, అంతే తల తిరుగుతుంది. ఇంక నీ కొంగు పట్టుకొని వదలడనుకో. నీకు అక్కడ దాస్యం తప్పుతుంది. ఏదో చిలకా గోరింకల్లా ఉంటారని ఇచ్చాను కాని, ఇరవై విస్తళ్లు లేచే కొంపలో వంటలక్క లాగా ఉండాలని కాదు, తలుచుకొంటే నా కడుపు తరుక్కుపోతోంది.

స : నిజంగా మందులో అంత శక్తి ఉంటుందంటావా అమ్మా?

జా : లేకపోవటమేమిటే వనమూలికలకి ఈశ్వర వేఱు చూపిస్తే ఎంత పామైనా తల వాల్చవల్సిందే - పోనీ, పట్టివ్వకపోతే వచ్చిన నష్టం ఏముంది? యథాప్రకారంగానే ఉంటారు.

స : ఏమో, నాకు భయమేస్తుంది - ఆలాంటి పని నేను చేయలేనమ్మా.

జా : అయితే నేనే కలుపుతాన్లే కాఫీ,

స : నామీద ఒట్టు అలాంటిపన్లు చెయ్యొద్దు. అసలికే మోసం రావచ్చు.

(రంగనాథం ప్రవేశం)

జా : ఎప్పుడొచ్చావోయ్? ఇదేనా రావటం? అంతా కులాసాయేగా? ఐనా ఇప్పుడేఁ రైలుంది? మంచినీళ్ళు కావాలా? అమ్మాయీ, కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళియ్యి,

రంగ: ఇదే రావటం. స్వాతంత్ర్యం వచ్చినతర్వాత రైళ్లు వాటిష్టం వచ్చి నట్లే వస్తున్నాయి. ఇవాళ నాల్గు గంటలు ఆలస్యం.

జా : లే భోజనానికి లే

రంగ: అబ్బే, బెజవాడలో భోంచేశాను. మీ ఒంట్లో ఎల్లా ఉంది ? కులాసా? ఆ...

జా: ఏమీ బాగాలేదు... చూస్తున్నావుగా. రక్తపు ఆటు పోటు అంటున్నారు.

రంగ : ట్రీట్మెంటు ఎవరు? మన కుమారస్వామేనా!

జా : 'బాలజ్యోతిషం... వృద్ధవైద్యం' అన్నారు. బొడ్డూడని కుమార స్వామా నాకు వైద్యం చేసేది? పిలవకుండానే ఒకసారి వచ్చి చూచి ఏ జబ్బూ లేదన్నాడు. పడేదాన్ని బాధ నాకు తెలుస్తుందా... చస్తున్నాను.

రంగ : అయితే కుమారస్వామి ఎందుకూ పనికిరాని వైద్యుడన్నమాట. పెద్ద ఫైలు గియిలు లేదన్నమాట.

జా: ఏమో నాయనా నీ స్నేహితుడు. ఏమన్నా నీకు కోపం రావచ్చు. డాక్టరుకి ఏదో సంసారం, పెళ్ళాం పిల్లలుంటే గృహస్థులు నలు గురూ పిలుస్తారుగాని, అచ్చోసిన ఆంబోతులాగ రోడ్లమ్మట తిరుగుతూంటే గౌరవంగల ఏ సంసారులు ఇంట్లోకి రానిస్తారు?నాయనా, నీకు స్నేహితుడంటావు. కాస్త పెళ్ళిచేసుకోమని చెప్పకూడదూ!

రంగ: చూస్తూ చూస్తూ అల్లాంటి సలహా ఎల్లా ఇమ్మంటారు అత్తయ్యగారూ!

జా: బాగుంది నాయనా, మరీచోద్యం. ఎంతమంది పిల్లల్ని ఇద్దామన్నా, ఊఁ అనడు, ఆ అనడట. మరి అతని మనస్సులో ఏముందో..

రంగ: వాడు, మా కుమారస్వామి, వీరేశ లింగంగారి శిష్యుడు లెండి.

జా: చచ్చాం, ఏ వెధవముండకో పుస్తెకడతానంటాడేమిటీ! ఏం ఖర్మం వచ్చిందనీ! చదువుకున్నవాళ్ళ బుద్ధులేమిటి?

రంగ: ఏమోనండి, వా డీమధ్య సెకండ్ హాండ్ కారుకొన్నాడు. ఏదో దానికి నప్పే భార్యనొక దానిని సంపాదించాలి

అనుకుంటున్నాడు. మనం ఇక ఎంతచెప్పినా లాభంలేదు లెండి. మీ ఎరికలో ఏమన్నా అటువంటి సంబంధం ఉంటే చెప్పండి.

జా : ఏమో బాబు, నా కటువంటిమాట అంటే పరమ అసహ్యం, ఈ మాత్రం తెలివితేటలు లేకనా నాయనా మేమంతా ఏనాడో ముండ మోసి ఇల్లాకూర్చుంటూ ఇంతకాలమైంది. స్నేహితుడు కాబట్టి వెర్రి వెర్రి వేషాలు వెయ్యక ఏదో సలక్షణమైన పిల్లనుజూచి పెళ్ళిచేసుకోమని చెప్పు. ఎంతమంది కాచుకున్నారో...ఊ అంటే కాళ్ల మీద పడేస్తారు.

రంగ : ఏమోనండీ, వాడి ఊహ మంచిదని తోస్తూంది. ఏమంటే, ఒక సారి మొగుడు చస్తేకాని ఏ ఆడదానికి మొగుడు గాడి విలువ తెలియదని నాక్కూడా నమ్మకం కుదిరింది. లేకపోతే మొద ట్లోనే మొగుడువిలువ గుర్తించిన ఆడది ఈ సృష్టిలో ఇంతవరకు పుట్టలేదని మా కుమారస్వామి ఏదో మాటలమీద నిన్న అన్నాడు - లెండి.

జా: విన్నావుటే సరళా! అయితే నిన్నన గానే నువ్వు ఈ ఊరుకువచ్చావన్నమాట.

రంగ: అబ్బే, నిన్న వాడే మా వూరు ఒక కేసు మీదవస్తే తిరిగి ఇద్దరం కల్సి వాడి కారు మీద వచ్చాంలెండి.

జా : ఇప్పుడే కాదు నాయనా ఏదో రైలుమీద వచ్చానన్నావు. ఇన్ని అబద్ధాలెందుకు? అక్కడ భోంచేసి ఇలా వచ్చానన రాదూ?

రంగా : కాదండీ, వాడి పాతకారు మధ్యలోనే ఆగిపోతే తోసి తోసి తొయ్య లేక ఇక రైలు ఎక్కక తప్పిందికాదు.

జా : ఆయితే నిన్ను ఇంటికి తీసుకుపోకుండా వదిలేడా ? పాపం ఒకళ్ల నొకళ్ళు విడచి ఉండగలరా? సరళా! కాఫీ పెట్టమ్మా, (సరళ నిష్క్రమణము).

రంగ: ఇక్కడికని చెప్పాను, ఈపాటికి బయలుదేరి వస్తూంటాడు లెండి. అయితే కాఫీ కేం తొందర, ముందు మంచి నీళ్ళిమ్మనండి.

జా : ఆమ్మాయి, మంచినీళ్లట, కాసిని ఇవ్వు (లోనికి వెళ్లును).

స : (మంచినీళ్ళతో ప్రవేశించి నీళ్లు ఇచ్చును).

రంగ: అయితే మీ అమ్మగారి రోగం చప్పగా కుదిరేవరకు నువ్వు ఇక్కడే ఉండటానికి నిశ్చయించుకొన్న ట్లేనా ?

స : మీ ఇష్టం. ఇందులో ఏముంది, ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను.

రంగ: వచ్చిన ఖర్మ, నా యిష్టం నీ యిష్టంకాదు. రెంటికీ అతీతం,మీ అమ్మగారి ఇష్టం.

-కాఫీతో జానకమ్మ ప్రవేశం-

జా : నా యిష్టం అంటున్నావేమిటి? ఉరుము ఉరిమి మధ్యన మంగలం మీద పడ్డట్టు, మొగుడు పెళ్ళాలు మీరు! మీరిద్దరూ కలసికట్టుగా ఉండాలిగాని, మీ సుఖమే నే కోరేది. నాకు మాత్రం ఎవరున్నారు?

రంగ: అంతే కాదులెండి. ఈ రోజుల్లో పెండ్లాన్ని ప్రేమించటం కంటే అత్తగార్ని ఆదరించటం తెల్సుకోకపోతే ఇంక అల్లుడికి రోజులు వెళ్ళవు.

జా: మాటలు నేర్చిన కుక్కని వేటకి తీసుకెళ్ళితే ఉస్కోమంటే ఉస్కో అందిట. ముందు కాఫీ తీసుకో.

రంగ: చాలా వేడిగా ఉందండీ. ఇంకో గ్లాసు తెప్పించండి.

జా : గ్లా సొకటి తే అమ్మా.

(సరళ నిష్క్రమణ)

(తెరలో)

స : గ్లాసు లెక్కడ ఉన్నాయే అమ్మా!

ము: వస్తున్నానుండు.

(సరళ ప్రవేశం గ్లాసుతో)

రంగ : ఇప్పు డా గ్లాసు తేవటం చల్లారిపోయాక.

సర: ఎల్లాగుంది కాఫీ.

రంగ: ఇది కాఫీయేనా అని అనుమానంగా ఉంది. చింతగింజల పొడుం కల్పినట్టుగా ఉంది. చాలా చేదుగా ఉందే.

(జానికమ్మ ప్రవేశం)

జా : పంచదార తెస్తానుండు (నిష్క్రమణ)

స : ఏం మరీ చేదుగా ఉందా?

రంగ: చింతగింజల పొడుంకాదే. సీకాయో లేక కుంకుడు పొడుమో అనుకుంటాను, తల తిరుగుతోంది. అబ్బా! (పడిపోతాడు).

స : (పట్టుకొని) అమ్మా, అమ్మా, పడిపోయారు, తల తిరుగుతోందటే,

(లోపలనుంచి వస్తూ)

జా: ఏం చోద్యమే, తల తిరగడం ఏమిటి? నోర్ముయ్యి.

స:	కాదే అమ్మా, చూడవే పడిపోయారే, ఇదేమిటే అమ్మా!

జా:	ఏం నాయనా? ఏమిటీ? తల తిరుగుతోందా?

స:	అమ్మా, ఏం అఘాయిత్యం జరగదుకదా! ఒళ్లు చల్లబడి పోతోందే.. గుడ్లు తేలేస్తున్నా రే!

జా :	ఊరుకోవే అయిదు నిముషాలు. అన్నీ సర్దుకొని పోతాయి.

సర:	అమ్మా, కొంపదీసి, ఇదేమిటే? డాక్టరుకు కబురంపించవే. ప్రమాదమేమన్నా జరుగుతుందేమో?

జా :	ఏం చెప్మా! ఇంత చప్పున, ఇల్లా పడిపోయాడేమిటీ. ఆగమ్మా ఎందుకైనా మంచిది డాక్టరుకు కబురంపిద్దాం.

స :	అదుగో అమ్మా, డాక్టరు కుమారస్వామిగారు వచ్చినట్టున్నారు.

(డాక్టరు కుమారస్వామి ప్రవేశం)

డాక్టరు : హల్లో! రంగనాథం! ఏం చేస్తున్నావు? రావచ్చా అంతఃపురంలోనికి?

జా :	నాయనా రా, నీ స్నేహితుడు తల తిరుగుతుందని ఇల్లా పడి పోయాడు. చూడు బాబు!

డాక్టరు: అఁ! ఇంతలో ఏమొచ్చింది? నాడి బలహీనంగా ఉందే. చెమటలు, నురుగులు ఆగండి, ఇంజక్షన్ ఇస్తా... వేడినీళ్లున్నాయా?

స :	తెస్తానాగండి. (నిష్క్రమించి కుంపటితో ప్రవేశం)

డాక్టరు: ఆశ్చర్యంగా ఉందే! (ఇంజక్షన్ తీస్తాడు) ఏమమ్మా, తల్లీ ఏం, ఏం వచ్చింది?

జా:	ఏం లేదండి... వచ్చి పచ్చి మంచినీళ్ళయినా తాగలేదు. వచ్చాడు కూర్చున్నాడు, ఏదో తల తిరుగు తోందన్నాడు, అంతే.

డాక్టరు: ఏదన్నా ఉంటే చెప్పండి. కక్కించేస్తా.

జా :	అబ్బే యేముంది కక్కించడానికి, ఏం తిన్నాడని అన్నం కూడా ఎక్కడో తినే వచ్చాడు.

స:	అమ్మా....

జా:	ఏమమ్మా, మన ఇంటిలో అన్నం అయినా తినలేదుగా.

డాక్టరు: నేనేదో బలవంతం పెట్టానులెండి, మా ఇంటిలోనే తిన్నాడు. నీళ్ళు కాగాయా? చూడు, ఇంజక్షనివ్వాలి.

(చేయి పట్టుకుంటాడు, కొయ్యబారిపోతాడు)

జా :	యేమిటాలోచిస్తున్నావు? ఇంజక్షనివ్వు.

డాక్టరు: ఇక ఇంజక్షనక్కరలేదులెండి.

స :	అంటే?

డాక్టరు : ఏమయిందమ్మా,

స: ఏమైందండీ, ఏమంటున్నారు...

డాక్టరు: ఏం లేదమ్మా. ఇంక ఇంజక్షను అవసరం లేదు, గుండె రాయిచేసుకో అమ్మా, రంగనాథం ఇక మనకి లేడు.

స :	అమ్మా.(యేడుస్తుంది)

జా :	నిజమేనా, ఇంతఘోరం... ఏమిటి నాయనా నువ్వనేది ? నా కర్థం కావటంలేదు,

డాక్టరు: ఏమండీ జారకమ్మగారూ! మీకు అర్థం కావటం లేదూ? అచ్చ తెలుగులో చెప్పాలంటే మీ అల్లుడు చచ్చిపోయాడండి,

జా :	అయ్యో...నిజమేనా !

డాక్టరు: ఏడవకమ్మ! ఏడవకు... ఏడ్చి ప్రయోజనంలేదు. అంతా అయిపోయిం తర్వాత ఎంత ఏడిస్తే ఏంలాభం. చచ్చినవాడు తిరిగివస్తాడా ?

స:	అమ్మా...బ్రతుకు ఎంత ఘోరమైపోయిందే, నే నిక్కడకు రాకుండాఉంటే ఎంత బాగుండేది! ఎందుకా టెలిగ్రామ్ ఇప్పిం చావ్ ఈ దుర్బుద్ధి నీ కెందుకు పుట్టిందమ్మా??

డాక్టరు : మీ అమ్మగార్ని అనుకొని ఏం ప్రయోజనం. ప్రాణమిత్రుడు నాకు, ఒక్క ఆరగంటముందు వచ్చిఉంటే ఇలా జరగనిచ్చేవాణ్ణి.

జా :	అరగంటముందు కాకపోతే గంటముందుగానే రాలేకపోయావా నాయనా!

డాక్టరు: ఇంతలోనే ఇంత ఘోరం జరిగిపోతుందని ఎవరను కొంటారు.

జా :	అవును బాబు, వాళ్ళింటి దగ్గరన్నా చచ్చిపోలేదుకదా !

డాక్టరు : వాడికి బుద్ధిలేక ఇక్కడకొచ్చాడు, ఈ అప్రతిష్ఠ అంతా నా నెత్తిన రుద్దటానికి కాక పోతే...

జా :	అప్రతిష్ఠ అంటున్నావేమిటి నాయనా ? అసలు చచ్చి మే మేడుస్తుంటే... మధ్య నా దేమిటి అతనంతట అతను వచ్చాడు వచ్చి అమాంతంగా ఆకస్మికంగా అర్థం కాకుండా..,

డాక్టరు:  ఇది బలవన్మరణంగా కనిపిస్తున్నదండీ !

జా :     ఏడవకమ్మా. నీ యేడుపు అసలు భరించలేను.

స :     ఏడవక చేసేదేముంది. చేతులారా తెచ్చి పెట్టుకున్న దీనికి.

జా :     పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడకు.

డాక్టరు: పిచ్చి పిచ్చిమాటలు కాదండీ, రంగనాథం ఆత్మ హత్య అని ఇది నా అనుమానం.

జా: అత్మహత్యా, ఎందుకు? నాయనా ఏమొచ్చిందని ?

డాక్టర : అందుకనేగా మాలె ఈ వేళ, విల్లు రాసి, నాచేత సాక్షిసంతకం చేయమని, ఎంత చెప్పినా వినకుండా...

జా :     విల్లురాశాడా, ఏమని, చచ్చిపోదామనే, ఏం రాశాడూ,

డాక్టరు : ఆస్తంతా సోదరులకు రాసేశాడు, పెళ్లానికేమిట్రా అని అడిగాను నేను, దానికేం తల్లి ఉందిగా అన్నాడు.

జా :     చూచావుదే, అర్థం ప్రాణం కూడా పోగోట్టుకున్నామె. (ఏడుపు)

స :     చా , ఎందుకు పెధవ యెకరాలు ఆయన పోయాక. నా కిక ఏ నుయ్యో గొయ్యో గతి, నేబతికి లాభమేముంది ? డాక్టరుగారూ, నాక్కూడా చచ్చి పోయేందుకు ఏదైన మందివ్వండి, మీపాదాలమీద పడ్తున్నాను.

డాక్టరు: చంపటానికి మందులివ్వటం నాకు చేతకాదు.

స:     అయితే అమ్మా, నువ్వన్నా నాకు మందివ్వవే, నేనింక ఎల్లా బ్రతికేదే, ఆ మందు నాకుగూడా ఇవ్వవే,

జా:     చూడు నాయనా, ఎల్లా ఏడుస్తుందో, నువ్వన్నా కాస్త చెపుదూ, బ్రతికున్నంతకాలం ఈ మొగుడితో ఏమన్నా సుఖపడిందా?... చూశావుగా చివరికేం జేశాడో..

స :     ఎందుకే అమ్మా, ఇంకా ఆయన్నలా ఆడిపోసుకుంటావూ?

జా :     ఇలాంటి విల్లు రాస్తాడని నాకేం తెల్సు. ఏమండీ డాక్టరుగారూ, మీరు చదువుకున్న వారుకదా. ఇలాంటి విల్లు మీద సాక్షి సంతకం పెడ్తారా? అమాయికురాలి గొంతు కోస్తారా ?

డాక్టరు : ఏమండోయ్, జానికమ్మగారూ! నాకు మీ అమ్మాయిని చూస్తే ఎంతో జాలేస్తోంది. కాని నేనేంచేయగలను? నన్నేం చేయమంటే అది చేస్తాను.

జా:     ఎలాగైనా వీరేశలింగం శిష్యుడవని అనిపించుకున్నావ్. ఇలాంటి ఆనాథ బాలికలను మెత్తనిగుండెకల నీ బోటివాళ్లు ఆదుకోకపోతే వారిగతేం కావాలి?

డాక్టరు : మీ మాటలు నా కర్థం కావటం లేదు.

జా: తర్వాత మాట్లాడుకుందాంలే. నాయనా... అమ్మాయిని ఉద్ధరిస్తానని అన్నావు, అదే పదివేలు, లే అమ్మా సరళా, చచ్చినవారితోపాటు మనమూ చస్తామా? కాస్త డాక్టరుగార్ని చూచన్నా కోలుకో అమ్మా, నీ కేం భయం లేదని ఆయన అభయమిస్తున్నారు, లే అమ్మా లే

స : ఛీ! పాడుబుద్ధి, ఇంతవరకూ చేసింది చాలక నా బ్రతుకు నవ్వుల పాలు చేద్దామనా? నువ్వు తల్లివా? రాక్షసివా? పచ్చటి నా కాపురంలో నిప్పులు పోశావు. ఆనందించు, నేనే పోతాను. ఏ నుయ్యో గొయ్యో చూచుకుంటాను. ఆయనతోటే పోయింది నాలో జీవం. నాకెవ్వరి దయా అక్కరలేదు. అన్నయ్యగారూ! మీకు నాపై నిజంగా దయ ఉంటే ఆయనతోపాటు ఈ పసుపు కుంకుమతోపాటు వెళ్ళిపోయే మందప్పించండి. మా ఇద్దర్నీ వేరు చెయ్యలేరు. నా ప్రాణం ఆయనతోటే పోయింది. మా యిద్దర్నీ వేరు చెయ్యవద్దు.

డాక్టరు: నిజమైన భార్యాభర్తల్ని చావుకూడా వేరు చెయ్యలేదు.

స : ఇటువంటి తల్లులు తల్లులు కారు. డాక్టరుగారూ! నాకు బ్రతకాలనిలేదు. నా దోవ నేనే చూచుకుంటాను. నేనింకా ఎలా బ్రతికేది?

జా: ఏదో దుఃఖాతిశయం వల్ల మొదట్లో ఇంతే డాక్టరుగారూ! కుర్ర పిల్ల! ఎట్లా బ్రతుకుతుందో! దాని మొహం, కన్న తల్లిని నేను కడుపులో పెట్టుకుంటాను, ఆ విల్లు ఎలాఏడిస్తే ఏంలెండి,

డాక్టరు : ఏమండో జానికమ్మగారూ, నాకు హృదయం ఉంది, ఈ విల్లు చింపేస్తున్నాను. మీ అమ్మాయికి అన్యాయం జరగనిస్తానా?

-విల్లు చింపును –

- రంగనాథం లేస్తాడు -

రంగ: చచ్చిపోయిన మిత్రుడికి ద్రోహం చేస్తావా? విల్లు చింపేసి? మిత్రద్రోహీ! విల్లు చింపేస్తే నా అంతరాత్మ ఎలా శాంతిస్తుందను కున్నావురా!

స : మీరు బ్రతికారా... అంతేచాలు నిజంగా బ్రతికారు. అమ్మయ్య!

జా : బాబోయ్, బ్రతికావా! రంగనాథం!

డాక్టరు: ఒరేయ్ నువ్వు బ్రతుకుతావని తెలిస్తే విల్లు చింపేసే వాడిని కాదురోయ్.

రంగ : ఛీ నోర్ముయ్ మిత్ర దోహీ! మాట్లాడకు.

డాక్టరు: ఒరే, అవునుగాని నువ్వేమంత పెద్దమనిషి విరా!. నా అంత డాక్టరు చచ్చాడని చెప్పి సర్టిఫికేటిస్తే సిగ్గు లేక ఏ ముఖం పెట్టుకొని బ్రతికావురా ? ఇంక నాకీ ఊళ్ళో ఉప్పూ గట్రా పుట్టు తుందా? మిత్ర ద్రోహి ! డాక్టర్ని నన్నుకూడా మోసం చేశావురా. ! ఇందాక సతస్కోపులోగూడ గుండె ఆగిపోయిందిరా. ఎంత గొప్ప నటుడివిరా

స : మీరు బ్రతికారు అంతేచాలు.

రంగ : అవును, బ్రతికాను, నాకిది పునర్జన్మ, చచ్చి బ్రతికాను,

స : మీకేకాదు, నాకునూ,

రంగ : నా గుండె నిన్న సాయంకాలమే ఆగిపోంది, 'ఎప్పుడైతే తులశమ్మగారు, మా అత్తగారికి వశీకరణాషధం మదురు పైనుండి అనుపాన ఉపదేశ సహితంగా అందించటం కంటపడిందో అప్పుడే ఆగిపోయింది.

జా : ఆ !

డాక్టరు : ఓ అదా ! నీ అబద్ధాలచావుకి కారణం.

రంగ : అవును, భగవంతు డనుగ్రహించిన ఆయుర్దాయం ఉన్నంతకాలం ఇంటికిపోయి స్వతంత్రంగా, స్వేచ్ఛగా బ్రతకాలని కొద్దిక్షణాలు అత్తగారింట్లో అబద్ధాల చావు చావక తప్పలేదు. ఇంటికిపోతున్నా నిజం బ్రతుకు బ్రతకటానికి.

స : పదండి...నేనూ వస్తున్నా (నిష్క్రమణ)

డాక్టరు : దీర్ఘాయురస్తు !

జా : ఏమో అనుకున్నాను, నువ్వూ?

డాక్టరు : చూశారా జానికమ్మగారూ, కథ ఎల్లా అడ్డం తిరిగిందో. ఇంత నాటకం ఆడి అల్లుడు చెప్పకుండా పోతే పోయాడుగాని కనిపెంచిన కూతురన్నా వెడుతున్నా నమ్మా అని చెప్పన్నా లేదు, పోనీలెండి ఇంకా మా వాడి ఆయుర్దాయముంది కాని నిజంగానే ఆ మందు త్రాగితే,

జా : త్రాగితేనా ! ముందరే తెల్సుకొని మందుకాస్తా బోర్లపోశాడు కాని, ఆ గుక్కెడు గొంతులో పేసుకొనిఉంటే ఈపాటికి కొంగుపట్టుకొని కదలకుండా కుక్కలా మా ఇంటిముందు పడి ఉండడా! ఏదో ప్రాలబ్ధం.

డాక్టరు : ఆహా ! అచంచలమైన మీ ఆత్మవిశ్వాసానికి నా హృదయం మీకు ప్రదక్షిణ నమస్కారాలు చేస్తోంది.

(కుమారస్వామి ఆమెచుట్టూ ప్రదక్షిణం చేస్తుండగా)

- తెర -